# అమ్మ మనసు

- పాలెపు బుచ్చిరాజు

అర్ధరాత్రి సమయం. కుండపోతగా వర్షం కురుస్తోంది. కప్పల బెకబెకలు, దూరంగా కుక్కల అరుపులు వాతావరణాన్ని మరింత భీతావహంగా చేస్తున్నాయి. పాడుపడిన పాత పెంకుటింట్లో అక్కడక్కడా టపటపా నీళ్లు కారుతున్నాయి. కరెంటు పోయింది. హరికేన్ లాంతరు చిమ్నీ సగం మసికట్టి, చీకటిని పారద్రోలడానికి వృథా ప్రయత్నం చేస్తోంది. నడకతో గుమ్మానికి జేరబడి శూన్యంలోకి చూస్తోంది వసుంధర. ఆ చిన్ని వెలుతురులో ఆమె కళ్లు మెరుస్తున్నాయి. ఆమెకు నిద్ర రాలేద . ఆ సుఖం ఆమె ఎప్పుడో మరిచిపోయింది. ఆ కళ్లు దేనికోసమో ఎదురుచూస్తున్నాయి ఎన్నాళ్లుగానో! వాటికి విసుగూ, విరామం లేదు ఆ శోధనలో.

ఉన్నట్టుండి వీధి గుమ్మం వైపు ఓ కుక్క గట్టిగా 'భౌ.. భౌ..'మని అరవసాగింది. పెరటి వైపున ఏదో దబ్బున పడిన శబ్దం అయింది. వసుంధరలో చలనం వచ్చింది. వంటింటి వెనక కిటికీ దగ్గర ఒక మానవాకారాన్ని చూసి, చప్పున లేచి వెళ్లి తలుపు తెరిచింది. విరిగిన చెట్టులా మీద పడ్డాడు అతను. రెండు చేతులతోనూ అతన్ని పొదివి పట్టుకుని, తను పడిపోకుండా సంభాళించుకుంది వసుంధర. అక్కడే తాడుమీద ఆరేసివున్న తువ్వాలు అందుకుని, అతని తలా, వొళ్లూ, చేతులూ తుడిచింది. అంత వర్షంలో తడిసి వచ్చిన వాడి శరీరాన్ని తుడిస్తే తువ్వాలు కంటింది నీరు కాదు, రక్తం! ఎన్ని తూటాలు తగిలాయో? ఎన్ని తూట్లు పడ్డాయో? శరీరం అంతా రక్తసిక్తం. 'ఇదేంటి కన్నా!' అని అడగలేదామె. ఆ బీభత్సానికి బెదిరి పోలేదామె.

అక్కడే, తన ప్రక్కనే కూర్చోపెట్టుకుంది. ఓ కంచంలో అన్నం, ఆవకాయ, పెరుగు గిన్నె తెచ్చి ప్రక్కన పెట్టుకుంది. కలిపి ఇస్తే చేత్తో తీసుకుని తినే స్థితిలో లేడతను. కుడి అరచేతిలోంచి దూసుకుపోయిన తూటా వేళ్లని వంగనివ్వలేదు. రెండు ముద్దలు ఆవకాయ కలిపి నోటికందించింది వసుంధర. ఆబగా తినసాగాడతను. 'పిచ్చి నాన్న! ఎన్నాళ్లయిందో తిండి తిని' అని మనసులోనే అనుకుంటూ మరో ముద్ద తినిపించింది. కొరబోయి తెరలు తెరలుగా దగ్గు వచ్చింది. 'నా దృష్టే తగిలిందేమో!' అనుకుంటూ, ఆవకాయ ప్రక్కన పెట్టి, పెరుగూ అన్నం కలిపి తినిపించింది. అతను ఆఖరి ముద్ద తింటుండగా, వీధి ప్రక్క గుమ్మంపై దబదబా బాదుతూ, తలుపు తీయమన్న అరుపులు వినిపించాయి. దీనంగా వసుంధర వైపొకసారి చూసి, వచ్చిన దారినే చీకట్లోకి అదృశ్యమయ్యాడు అతను.


ఆదరాబాదరాగా లేచి వెళ్లి తలుపు తీసింది వసుంధర. ఇద్దరు జవాన్లు, ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేతిలో బ్యాటరీ లైట్లు, తుపాకులతో చరచరా ఇంట్లోకి ప్రవేశించారు. జవానులిద్దరూ ఇల్లు నాలుగు మూలలా గాలించసాగారు. వారి విధ్వంసకాండ పూర్తయ్యే వరకు వసుంధర నోరు విప్పలేదు. వంటింటి గుమ్మానికి ఆనుకుని, నిర్లిప్తంగా, నిశ్చలంగా నిలబడింది. అటు ప్రక్కగా వచ్చిన ఎస్సై ఆమెను, వంటింట్లో సగం తిని వదిలిపెట్టిన పెరుగన్నంతో వున్న కంచాన్ని మార్చి మార్చి చూశాడు. ఒక్క ఉదుటిలో ముందుకు రాబోయి, ఆమె దీన వదనాన్ని చూసి ఆగిపోయాడు. ఎస్సై కూడా ఓ అమ్మ పెట్టిన గోరుముద్దలు తిని కండలు పెంచుకున్నవాడే! ఇంతలో తెల్లమొహాలు వేసుకొచ్చిన జవానులిద్దర్నీ చూసి, 'పదండి' అన్నట్టు సైగ చేసి తనూ బైటికి నడిచాడు ఎస్సై.

మర్నాడు ఉదయం పేపర్లో వార్త- 'ఉగ్రవాది కిశోర్ పట్టివేత. ఈసారి శిక్ష ఖాయం'.

అది తెలుసుకుని వసుంధర మనస్తాపం చెందింది. తన ప్రాణం కిశోర్ మరోసారి ఉక్కు సంకెళ్లతో బంధింపబడ్డాడు. 'ఇలా ఎన్నేళ్లో? ఇలా ఎన్ని ప్రాణాలో?' అని రోదించింది.

కిశోర్‌కి ఆ పేరు తనే పెట్టుకుంది. తన కొడుకు బాల కిశోరంలా పెరగాలని కోరుకుంది.

ఎగిరిపోయే మనుషులంటే తనకి గిట్టదు. ఈ విషయంలో భర్తతో వచ్చిన భేదాభిప్రాయాలు సైతం తను లెక్కచేయలేదు. అన్యాయాన్ని, అక్రమాన్ని ఎదిరించి నిలిచి పోరాడే కిశోర్ అంటే తనకి పంచప్రాణాలు. అట్టి వాళ్లు దోషులుగా పరిగణింపబడుతూ, దొంగతనంగా బతకవలసి రావడం ఈ దేశానికి పట్టిన దౌర్భాగ్యం. పైకి తీపి కబుర్లు చెబుతూ తడిగుడ్డతో గొంతులు కోసే దొంగ నాయకులు అమాయక ప్రజలపై రాజ్యం చేయడం ఇంకా శోచనీయం.




ఒక పోలీసు జవాను వచ్చి తలుపు తట్టడంతో వసుంధర ఆలోచనలకి అంతరాయం కలిగింది. మళ్లీ ఏం అవాంతరం వచ్చిందో అని ఆదుర్దాగా తలుపు తీసింది. ఆ వచ్చిన వాడొక చీటీ ఆమె చేతిలో పెట్టి వెళ్లిపోయాడు. అది- 'కిషోర్ ఆత్మీయులు ఎవరైనా అతన్ని కలవాలన్నా,మాట్లాడాలన్నా ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు, పదిహేను నిముషాలసేపు వచ్చి కలుసుకోవచ్చు' అని ఇన్ఫర్మేషన్ లెటర్.

'హుం! పదిహేను నిముషాలు!

వాడు పిరికిపంద కాకూడదనీ, ధైర్యసాహసాలున్న మనిషిగా బతకాలనీ కోరుకుంది. వాడు చిన్నప్పుడు బళ్లో ప్రక్క కుర్రాడు కొట్టాడని ఏడుస్తూ ఇంటికి వస్తే తనకెంతో ఉక్రోషం వచ్చేది. 'వాడిని నువ్వెందుకు తిరిగి కొట్టలేదు? నా కొడుకు పిరికివాడు కావడం నాకిష్టం లేదు' అని ధైర్యం చెప్పేది. అతనిలో అలా తిరుగుబాటు మనస్తత్వం ఉగ్గుపాలతో నూరి పోసింది తనే! ఈసురోమంటూ, గాలి ఎటు వీస్తే అటు

అదేమైనా యుగాలా? ఆ కాస్త సమయంలో జీవితాన్నంతా తిరగతోడుకోగలమా? మనసులోని మాటలు పైకి పెగిలి రావడానికి అంతకంటే ఎక్కువ టైమే పడుతుంది. ఏం మాట్లాడుకోగలం? వెళ్లి తనేం చేయగలదు? ఇవన్నీ మానేసి పిరికిపందలా తిరిగి వచ్చి గొర్రెల మందలో చేరిపొమ్మననా! ఈ పోరాటం ఇలాగే సాగించమని చెప్పనా! ఏమైనా వెళ్లాలి. నా కిశోరాన్నొకసారి చూసి రావాలి. తన కోసం కూడా ఎవరో వస్తారని

వాడికనిపించాలి. నిరాశా నిస్పృహలనేవి వాడి జీవితంలో చోటు చేసుకోకూడదు. అందుకే వెళ్లాలి' అని నిశ్చయించుకుంది వసుంధర.

సాయంత్రం ఆరు గంటలకల్లా కిశోర్‌ని డిటెయిన్ చేసిన పోలీస్‌స్టేషన్‌కి చేరుకుంది వసుంధర వర్షం పడుతున్నా లెక్కచేయకుండా! గేటు ముందు గస్తీ నిలబడిన జవానుకి ఉత్తరం చూపించింది. వాడు ఎస్సై వద్దకు వెళ్లి వచ్చి, 'రమ్మంటున్నార'ని చెప్పాడు. తడబడే అడుగులతో, తడిసిన శరీరాన్ని చీర చెంగుతో తుడుచుకుంటూ వచ్చి, ఎస్సై టేబుల్ ముందు నిలబడింది. ఎదురుగా గోడ మీద గాంధీగారి ఫొటో, ప్రక్కనే మూడు సింహాల బొమ్మ అలంకరించబడి ఉన్నాయి. ఎస్సై ఒక ఆడపోలీసుని పిలిచి, ఆమెను తనిఖీ చేసి లోపలికి పంపించమని ఆజ్ఞాపించాడు. ఆడ పోలీసు వసుంధరను ఆపాదమస్తకం పరీక్షించి జైలు సెల్‌లోకి పంపింది.

అక్కడ కటకటాల గది తాళం తీసి, కిశోర్‌ని బైటికి తీసుకువచ్చి ఒక కుర్చీ మీద కూర్చోబెట్టారు. ఎదురుగా ఉన్న కుర్చీ తన కోసం. వెళ్లి మౌనంగా దానిమీద కూర్చుంది వసుంధర.

ఒకనాటి తన అద్దాల్లోని నీలి నీలి నయనాల బాలకిశోరాన్ని తల్చుకుంటూ సూటిగా అతని కన్నుల్లోకి చూసింది. ఏదీ? ఆనాటి అమాయకత ఆ కళ్లలో? వ్యవస్థపై ద్వేషం, కోపం, మనుషులపై పగ... అన్నీ రంగరించుకున్న రక్తిమ పెనుతుపానై ఆ నీలిమని కబళించివేసింది. మనసులో చెలరేగే ప్రతీకార భావాలు ఎర్రజీరలై నిప్పులు గ్రక్కుతున్నాయి ఆ కళ్లు.

ఇక ఎక్కువసేపు అలా చూడలేక కళ్లు క్రిందికి దించుకున్నాడు కిశోర్. వసుంధర దృష్టి ఆ చేతులపై పడింది. మండల మీద, వేళ్ల మీద పడిన లాఠీ దెబ్బలతో ఆ చేతులు నల్లబడి కర్కశంగా తయారయ్యాయి. తన చిన్నారి కిశోర్ ముద్దుల చేతులేనా ఇవి? నెలల పిల్లవాడిని ఒళ్లో పడుకోబెట్టుకుని ఆ లేత గులాబీ అరచేతుల్ని చూస్తుంటే, పారదర్శకంగా వుండి, అటున్న వస్తువులు కనిపిస్తున్నట్టుండేవి. అంత సున్నితమైనవీ చేతులు. అవి నలిగితే తన గుండెలు నలిగినంత బాధపడింది తను. ఆ చేతులేనా ఈనాడిలా నరికిన తుమ్మ మొద్దుల్లా తయారయ్యాయి. అవి లాఠీ దెబ్బల్ని ఎలా ఓర్చాయెూ! ఎన్నిసార్లు 'అమ్మా' అని తల్చుకున్నాయో! చిన్నప్పుడు ఒళ్లో కూర్చోబెట్టుకుని కథలు చెబుతూ– అరచేతిలో ఆకేసి, అన్నం పెట్టి, పప్పేసి, నెయ్యి వేసి, కలిపి, తినిపించి, తినిపించి, 'అత్తారింటికి దారేదీ' అని చంకల్లో గిలిగింతలు పెడితే కిలకిలా నవ్విన నోరూ, పెదవులేనా అవి. అంత మొద్దుబారిపోయాయేం? ఎవర్నని అడుగుతుంది తను? ఎవరు సమాధానం చెప్పగలరు? ఎంతసేపు ఇలా చూస్తూ కూర్చుంటే తనివితీరుతుంది? ఈ సమాగమానికి అంతేది? ఎన్నో జవాబుల్లేని ప్రశ్నలు...

'టైమయిందమ్మా!' ఆడపోలీసు వచ్చి గడువు పూర్తయిన విషయం తెలియజేయగానే ముందుగా లేచి నిలబడింది వసుంధర. లేని నిలబడ్డాడు. ఏం చెబుతుంది తను? ఏం చెప్పాలన్నా తన దగ్గర మాటల్లేవు. నాలుగడుగులు ముందుకేసి వెనక్కి తిరిగి చూసింది. అతను విసురుగా కటకటాల వెక్కి వెళ్లిపోయాడు. జైలు తలుపులు మూసుకున్నాయి. వసుంధర బాహ్య ప్రపంచంలోకి వచ్చింది.

ఏదో తెలియని అసంతృప్తి చోటుచేసుకుంది ఆమె మనసులో. ఆలోచిస్తూ ఇంటివైపుగా నడవసాగింది.

తను తప్పు చేసిందా? కిశోర్‌తో మాట్లాడి ఉండవలసిందా? ఏం చెప్పగలను? అంతా వదిలిపెట్టేయమని పిరికి మందు నూరిపోయగలదా? ప్రతినిత్యం మృత్యువుతో పోరాడమని చెప్పగలదా? పిల్లల హృదయాలు కాలిపోతుంటే ఏ తల్లి గుండెలు తల్లడిల్లవు? అటు అక్రమాలకీ, అన్యాయాలకీ బలైపోయే తమ్ముళ్లూ, చెల్లెళ్లూ, ఇటు హింసాకాండకి గురైపోయే అన్నలూ, అక్కలూ అందరూ ఏదో ఓ తల్లికి పిల్లలే! ఏదైనా ఊచకోత ఈ అమ్మ గుండెలకే! ఏది దీనికి పరిష్కారం?

దగ్గర్లో నాలుగు రోడ్ల కూడలిలో రాజకీయ నాయకుడు కాబోలు అరుస్తున్నాడు. 'ఈ ఆటంకవాదుల్ని ఏరిపారేయాలి. ప్రభుత్వం ఇనుప హస్తాల్తో ఈ ఉద్యమాల్ని అరికట్టాలి. వీళ్లంతా దేశానికి పట్టిన చీడపురుగులు. ఇంకా...'

ఉన్నట్టుండి బాంబు ప్రేలిన శబ్దం. హాహాకారం...

ఆ తరువాత నిశ్శబ్దం... ●